APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 26 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :91 పేజీలు : 04 వెల: 2-00/-

## భారత్‌లో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు
## 98% కేసులకు వైరస్ రకమే కారణం



- దేశంలో 98 శాతం శ్వాసకోశ వ్యాధులకు కారణం హెచ్ 1ఎన్ 1 వైరస్ - ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ వెల్లడి
- భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్

ఢిల్లీ : భారతదేశంలో ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న శ్వాసకోశ వ్యాధులకు హెచ్ 1ఎన్ 1 వైరస్ రకమే ప్రధాన కారణమని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ మంగళవారం వెల్లడించారు. తాము పరీక్షించిన ఇన్ ఫ్లూయెంజా-ఏ కేసుల్లో దాదాపు 98 శాతం ఈ వైరస్ రకానికే చెందినవని ఆయన తెలిపారు. వైరస్ ల వ్యాప్తిని ఎప్పటికప్పుడు కనిపెట్టేందుకు, భారతదేశం

## డిజిటల్ పేమెంట్ జర్నీలో యూపీఐ టర్నింగ్ పాయింట్
# ప్రతి భారతీయుడు గర్వపడాలి


- 2016లో ప్రారంభమైన యూపీఐకి పదేళ్లు
- 2025-26లో 24,162 కోట్లకు పైగా లావాదేవీలు
- 11 దేశాలకు విస్తరించిన భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ
- 2026 జులైలో రూ.29.87 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు



ఢిల్లీ : దశాబ్దం క్రితం ప్రారంభమైన యూపీఐ దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో ఓ చారిత్రక మైలురాయని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ నేడు దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక సమ్మిళిత సాధనకు వెన్నెముకగా నిలిచిందని మోదీ వెల్లడించారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా విస్తృతి, ప్రజల్లోకి చేరిన తీరు ప్రతి భారతీయుడు గర్వపడే అంశమని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం యూపీఐ ప్రారంభం కావడం దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచిందని 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో తెలిపారు. యూపీఐని ఉపయోగించడం ద్వారా తమకు ఎదురైన అనుభవాలను మిగతా..2లో

## దేశీయ సంస్థలకే DRDO క్షిపణి టెక్నాలజీ
# రాజ్ నాథ్ సింగ్ కీలక నిర్ణయం

- డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీ బదిలీకి రక్షణ మంత్రి ఆమోదం
- దేశీయ తయారీ సామర్థ్యాలను మరింత పెంచడమే లక్ష్యం



ఢిల్లీ : రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను భారతీయ పరిశ్రమలకు బదిలీ చేసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. దేశీయ సంస్థలు ఈ సాంకేతికతలను ఉపయోగించి భారత్‌లోనే క్షిపణులను తయారు చేసుకునేందుకు మార్గం సుగమమైంది. రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం, డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీని అర్హత కలిగిన భారతీయ సంస్థలకు మిగతా..2లో

## వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి



- రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు.
- వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 25 : రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు.

## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణను వేగవంతం చేయండి..
# సీఎం రేవంత్ ఆదేశాలు

- మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.
- మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.
- ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించుకోవాలన్నారు.




హైదరాబాద్, ఆగస్టు 25: మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించుకోవాలన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్‌లను పిలవాలని ఆదేశించారు. ప్రాజెక్ట్‌లకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.


## ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు..
## విదేశీ విద్యంటే నమ్మేదెలా



- కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని ప్రశ్నించారు.

హైదరాబాద్, ఆగస్టు 25: కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని ప్రశ్నించారు. ఫీజు బకాయిలు అందక ఉన్న కాలేజీలే మూత పడుతున్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రప్పిస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. లక్షలాది మంది విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ సీఎంకు పట్టదా అని నిలదీశారు. 'సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు.. విద్యార్థులకు చేస్తున్న అవమానాలు కనిపించడం లేదా? ఫీజు బకాయిలు అడిగితే కాలేజీ యాజమాన్యాలను మిగతా..2లో

## రాయలసీమకు సుజ్లాన్ భరోసా.. రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన




- రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం
- అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, మిగతా..2లో

## యూఎస్ పర్యటనపై సీఎం రేవంత్ క్లారిటీ ఇవ్వాలి



అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 25: అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు. అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ మిగతా..2లో

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే
# వైసీపీదే విజయం




- స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
- క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య

## 30 ఏళ్ల సంకల్పం సాకారం.. ఆగస్టు 31న
# వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

- ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల క్రితం తాను శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు వెల్లడి
- నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయనున్న ప్రభుత్వం
- పశ్చిమ ప్రకాశం ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ
- వెలిగొండ జలాలతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు వస్తాయని ధీమా

## చంద్రబాబు ఎమోషనల్ ట్వీట్



అమరావతి : ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31వ తేదీన ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 1996లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మిగతా..2లో

## గ్రేట్ గ్రీన్ వాల్‌లో తాటి వనాలు
## 55 లక్షల గింజలు నాటడమే లక్ష్యం



- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యమన్న డిప్యూటీ సీఎం పవన్
- గ్రేట్ గ్రీన్ వాల్ పై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన

అమరావతి : సుదీర్ఘ తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచం కోసం చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో భాగంగా తాటి వనాలు పెంచే ప్రక్రియ మొదలైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో 55 లక్షల తాటి గింజలను నాటుతున్నట్లు చెప్పారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో లక్షా 65 వేల తాటి గింజలు నాటినట్లు తెలిపారు.

మొదటి పేజి తరువాయి

## గ్రేట్ గ్రీన్ వాల్‌లో తాటి వనాలు 55 లక్షల గింజలు నాటడమే లక్ష్యం

ప్రకృతి విపత్తుల సమయంలో తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు పని చేస్తాయని అన్నారు. తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉంచడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుందని వివరించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పవన్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం: ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాన్ని రక్షించడం, వాటి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర అటవీ శాఖ "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మహా హరిత కుడ్యం)" ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం తీరప్రాంతం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పుతో పర్యావరణ కారిడార్ ఏర్పాటు చేయనుంది. దీన్ని తీరానికి బయోషీల్డ్‌గా (జీవ రక్షణ కవచం) తీర్చిదిద్దనుంది. మొత్తం 3 జోన్లతో గ్రేట్ గ్రీన్ వాల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే కార్యాచరణ మొదలైంది. తీరప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు తరచూ తుపానులు, సునామీలు, వరదలు, సముద్రమట్టం పెరుగుదల, తీరప్రాంత కోత ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు. కృష్ణా-గోదావరి డెల్టాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకుపోకుండా కాపాడే సహజ రక్షణ కవచాలైన నదీ ముఖద్వారాల పరిసర ప్రాంతాల్లో సముద్రపు కోత తీవ్రంగా ఉంది. దీని వల్ల భూమిని కోల్పోతున్నాం. పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. వరదలు పెరుగుతున్నాయి. తుపానులు, వరదల వల్ల పంటలు, పశు సంపదతో పాటు మత్స్యకార మౌలిక వసతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కలుషిత నీరు, క్షీణిస్తున్న వ్యవసాయ భూములు ఆహార సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ఈ తరహా సహజ విపత్తుల నుంచి రక్షించేందుకు 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గ్రేట్ గ్రీన్ వాల్‌ను పూర్తి చేసి దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలుపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు.. విదేశీ విద్యంటే నమ్మేదెలా

బెదరించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమిటి? ఫీజు రీయింబర్స్ బకాయిల వల్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టదా? ఇందిరమ్మ రాజ్యమంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యకు దూరం చేయడమేనా? వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది?' అంటూ బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. హామీలిచ్చి మోసం చేయడంలో బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతున్నారని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే బీజేపీ స్టేట్ చీఫ్ రాంచంద్రరావు 'ఫీజు బకాయి- బీజేపీ లడాయి' దీక్ష చేపట్టారని చెబుతూ.. ఆయన 'దీక్ష'కు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారన్నారు. రాంచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేదాకా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

## డిజిటల్ పేమెంట్ జర్నీలో యూపీఐ టర్నింగ్ పాయింట్- ప్రతి భారతీయుడు గర్వపడాలి

పంచుకోవాలని, ఇది తమ రోజువారీ జీవితాలను ఎలా మార్చిందో వివరించాలని ప్రజలను ప్రధాని కోరారు.

పదేళ్లలో భారీ వృద్ధి

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన యూపీఐ ప్రస్తుతం దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలక భాగంగా మారింది. ప్రారంభమైన సమయంలో పరిమిత స్థాయిలో ఉన్న ఈ సేవ, ఇప్పుడు దేశంలోని కోట్లాది మంది రోజువారీ లావాదేవీలకు ప్రధాన సాధనంగా మారింది. గత పదేళ్లలో యూపీఐ లావాదేవీల సంఖ్య, వాటి విలువ రెండింటిలోనూ భారీగా వృద్ధి నమోదైంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, 2016-17 ఆర్థిక సంవత్సరంలో యూపీఐ ద్వారా 1.78 కోట్ల లావాదేవీలు మాత్రమే జరిగాయి. 2025-26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు పైగా పెరిగింది. అంటే కేవలం పదేళ్లలో లావాదేవీల సంఖ్య దాదాపు 13 వేల రెట్లు పెరిగింది. అదే సమయంలో లావాదేవీల మొత్తం విలువ కూడా అనూహ్యంగా పెరిగింది. 2016-17లో రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీల విలువ, 2025-26 నాటికి సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది 4 వేల రెట్లకు పైగా పెరుగుదల అని చెప్పింది.

11 దేశాల్లో సేవలు

భారత్‌లో విజయవంతమైన యూపీఐ ఇప్పుడు అంతర్జాతీయంగానూ విస్తరిస్తోంది. ప్రస్తుతం 11 దేశాల్లో ఈ చెల్లింపు వ్యవస్థ అందుబాటులో ఉంది. గ్రీస్, మాల్దీవులు తాజాగా యూపీఐ సేవలను స్వీకరించిన దేశాలుగా నిలిచాయి. భూటాన్, నేపాల్, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్, ఖతార్ వంటి దేశాల్లోనూ యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో విదేశాల్లో ఉన్న భారతీయులు, ఆయా దేశాల్లోని వినియోగదారులు సరిహద్దులు దాటి డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం ఏర్పడింది.

జులైలోనే రూ.29.87 లక్షల కోట్ల లావాదేవీలు

యూపీఐ వినియోగం ఎంత భారీ స్థాయికి చేరిందో తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 జులై నాటికి యూపీఐ నెట్‌వర్క్‌లో 741 క్రియాశీల బ్యాంకులు ఉన్నాయి. ఆ ఒక్క నెలలోనే 2365.8 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ అయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.29.87 లక్షల కోట్లుగా నమోదైంది. చిన్న మొత్తాల నుంచి భారీ చెల్లింపుల వరకు వివిధ అవసరాలకు యూపీఐని ప్రజలు ఉపయోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్త రియల్‌టైమ్ చెల్లింపుల్లోనూ యూపీఐ తన ప్రత్యేకతను చాటుకుంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన రియల్‌టైమ్ చెల్లింపు లావాదేవీల్లో యూపీఐ వాటా దాదాపు 49 శాతంగా ఉంది. రిటైల్ డిజిటల్ చెల్లింపుల వృద్ధిపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన నివేదికలోనూ భారత్ సాధించిన పురోగతిని ప్రముఖంగా ప్రస్తావించింది.

కొత్త ఫీచర్లతో మరింత సులభంగా

వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు యూపీఐలో కొత్త ఫీచర్లను కూడా ప్రవేశపెడుతున్నారు. 2025లో ఆన్-డివైస్ అథెంటికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ అన్‌లాక్ వంటి సదుపాయాలను ఉపయోగించి యూపీఐ చెల్లింపులను ఆమోదించవచ్చు. అదే విధంగా ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్ ద్వారా యూపీఐ పిన్ ఏర్పాటు ప్రక్రియను మరింత సులభతరం చేశారు. ముఖ్యంగా తొలిసారి యూపీఐని ఉపయోగించే వారు, సీనియర్ సిటిజన్లు, కార్డులు సులభంగా అందుబాటులో లేని వారికి ఈ సదుపాయం ఉపయోగపడనుంది.

## యూఎస్ పర్యటనపై సీఎం రేవంత్ క్లారిటీ ఇవ్వాలి

తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ ప్రక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు. కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## రాయలసీమకు సుజ్లాన్ భరోసా.. రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు. ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ,

## 30 ఏళ్ల సంకల్పం సాకారం.. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. చంద్రబాబు ఎమోషనల్ ట్వీట్

మొదటి పేజి తరువాయి

తానే శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును, మళ్లీ తన చేతుల మీదుగానే ప్రారంభించడంపై ఆయన ఎక్స్ వేదికగా భావోద్వేగంతో స్పందించారు. 'వెలిగొండ జలసిరులు అభివృద్ధికి రెక్కలు' అంటూ ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి మార్కాపురం జిల్లా వేదిక కానుందని, ఈ సందర్భంగా నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసి కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందిస్తున్నామని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం తాను తీసుకున్న సంకల్పం నేడు సాకారమైందని, తీవ్ర కరవు ప్రాంతమైన ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో ఇది గొప్ప మార్పు తీసుకువస్తుందని అన్నారు. ఈ మేరకు 1996 మార్చి 5న తాను శంకుస్థాపన చేసిన నాటి ఫొటోను ప్రస్తుత ట్వీట్‌కు జత చేశారు.




ఈ ప్రాజెక్టుతో తరతరాలుగా కరవుతో పోరాడుతున్న ప్రజలకు శాశ్వత ఉపశమనం కలుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఫేజ్-1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2 పూర్తయితే మరో 3.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. కేవలం సాగునీరే కాకుండా, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి, పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. "దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ ఒక వెలుగుల దండ అవుతుంది" అని ఆయన అభివర్ణించారు. ప్రాజెక్టుతో పాటు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.1 లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. బెంగళూరు-అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తామని చెప్పారు. "ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా... ఇదే 'సీబీఎన్ అనే నేను' సంకల్పం" అని చంద్రబాబు తన ట్వీట్‌లో స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ 'నేను...' అనే స్ఫూర్తితో పనిచేసి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

మొదటి పేజి తరువాయి

అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను



ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60-70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

మొదటి పేజి తరువాయి

ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టార్గెట్‌లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు.

### ప్రతి మొక్కను సంరక్షించాలి..

మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా చూడాలని



అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు.

### చీవీమీ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలి..

పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చీవీమీ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశం చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశించారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

### ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

## దేశీయ సంస్థలకే DRDO క్షిపణి టెక్నాలజీ'- రాజ్ నాథ్ సింగ్ కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

బదిలీ చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ సంస్థల నిబంధనలను కంపెనీలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ద్వారా డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన క్షిపణి సాంకేతికతలు కేవలం ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితం కాకుండా, అర్హత ఉన్న దేశీయ పరిశ్రమలు కూడా వాటిని ఉత్పత్తిలోకి తీసుకురావడానికి అవకాశం లభిస్తుంది.

### ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఊతం

రక్షణ తయారీలో దేశీయ సామర్థ్యాలను పెంచడం, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో డీఆర్‌డీఓ టెక్నాలజీని భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడం కీలక అడుగుగా రక్షణ మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. దేశ రక్షణ అవసరాలను దేశీయంగా తీర్చుకోవడంతో పాటు, భారతీయ సంస్థలకు అత్యాధుని రక్షణ సాంకేతికతలపై పనిచేసే అవకాశం కల్పించడం ద్వారా రక్షణ తయారీ రంగం మరింత విస్తరించనుంది. దీర్ఘకాలంలో దేశీయ రక్షణ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

### హైపర్‌సోనిక్ ఆయుధాలపైనా దృష్టి

ఇప్పటికే భారత్ స్వదేశీ హైపర్‌సోనిక్ ఆయుధాల అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. హైపర్‌సోనిక్ గ్లైడ్, క్రూయిజ్ క్షిపణి సాంకేతికతలపై డీఆర్ డీఓ పరిశోధనలు కొనసాగిస్తోంది. అత్యంత వేగంతో ప్రయాణించే ఈ తరహా ఆయుధ వ్యవస్థలు భవిష్యత్తు రక్షణ అవసరాల్లో కీలకంగా మారనున్నాయి. ఇలాంటి అధునాతన సాంకేతికతలపై దేశీయంగా పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా రక్షణ రంగంలో భారత్ వ్యూహాత్మకంగా మరింత బలోపేతం కావాలని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీని దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధి నుంచి భారీ స్థాయి ఉత్పత్తి వరకు దేశీయ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నాల్లో ఇది మరో ముందడుగుగా నిలవనుంది.

### 12 ఏళ్లలో నాలుగు రెట్లు పెరిగిన రక్షణ ఉత్పత్తి

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దేశ రక్షణ తయారీ సామర్థ్యాన్ని ప్రస్తావించారు. గత 12 ఏళ్లలో దేశ రక్షణ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. దేశీయ రక్షణ పరిశ్రమ విస్తరిస్తోందని, తయారీ సామర్థ్యాలను మరింత పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రక్షణ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, రక్షణ ఉత్పత్తి విలువ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15.6 శాతం పెరిగింది. 2020-21లో రూ.84,643 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తి విలువ 2024-25 నాటికి గణనీయంగా పెరిగింది. 2013-14తో పోలిస్తే స్వదేశీ రక్షణ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



### రికార్డు స్థాయిలో ఎగుమతులు

భారత్ రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో భారత్ రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.38.424 కోట్లకు చేరాయి. ప్రస్తుతం 80కు పైగా దేశాలకు భారత్ రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. 2029 నాటికి రక్షణ ఎగుమతులను రూ.50 వేల కోట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్య సాధనలో దేశీయ పరిశ్రమల పాత్ర కీలకం కానుంది. ఇక భారత రక్షణ పారిశ్రామిక వ్యవస్థలో ప్రైవేటు రంగం కూడా కీలక భాగస్వామిగా మారుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ మొత్తం రక్షణ ఉత్పత్తిలో ప్రైవేటు రంగం వాటా సుమారు 24 శాతంగా ఉంది. రక్షణ ప్రభుత్వం రంగం సంస్థలు, ఇతర ప్రభుత్వ రంగం సంస్థలు కలిపి దాదాపు 76 శాతం ఉత్పత్తిని అందించాయి.


## భారత్‌లో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు- 98% కేసులకు వైరస్ రకమే కారణం

మొదటి పేజి తరువాయి

ఒక బహుళ అంచెల, రియల్ టైమ్ వ్యాధి నిఘా నెట్ వర్క్ ను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఈ నిఘా వ్యవస్థ రాష్ట్ర స్థాయి డేటాను 'సమీకృత ఆరోగ్య సమాచార వేదిక' (ఐహెచ్ ఐపీ), 'జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం(ఎన్ సీడీసీ)తో అనుసంధనం చేస్తుందని తెలిపారు. దీనితోపాటు ఐసీఎంఆర్ నేరుగా ఆసుపత్రుల నుంచి సేకరించిన శాంపిల్స్ ద్వారా హెచ్ 1ఎన్ 1 వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదలను తక్షణమే గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటుందని అన్నారు. "దేశంలో ఏ వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుందో మనకు ఎలా తెలుస్తుంది? కొవిడ్ తర్వాత, భారతదేశంలో ఏ సమయంలో ఏం జరుగుతుందో రియల్ టైమ్ లో గుర్తించే సామర్థ్యాన్ని మనం పెంచుకున్నాం. మేము బహుళ స్థాయిల్లో నిఘా పెడతాం. మొదట ఐహెచ్ ఐపీ, ఎన్ సీడీసీ నిఘా ద్వారా అన్ని రాష్ట్రాల నుంచి ఇన్ఫెక్షన్ల సమాచారం వస్తుంది. దాన్ని మేము తీసుకుంటాం. వారి ల్యాబ్ ల నుంచి వచ్చిన నివేదికలు కూడా మాకు అందుతాయి. ఇవి కాకుండా, ఈ హెచ్ 1ఎన్ 1 వైరస్ లాంటి పరిశీలన సింగ్రోమ్ లను కనిపెట్టడం కోసం, మేము దేశమంతటా 73 ల్యాబ్ లు/ ఆసుపత్రుల ద్వారా ఐసీఎంఆర్ సెంటినెల్ నిఘాను ఏర్పాటు చేశాం. ఇది ఎన్ సీడీసీ కంటే పై స్థాయిలో జరుగుతుంది" అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ తెలిపారు.

### విపరీతంగా పెరుగుతున్న కేసులు

ఇతర శ్వాసకోశ వైరస్ లతో పోలిస్తే హెచ్ 1ఎన్ 1 ఇన్ఫెక్షన్లు దేశవ్యాప్తంగా విపరీతంగా పెరుగుతున్నాయని రాజీవ్ బాల్ తెలిపారు. అదే సమయంలో కొవిడ్-19 కేసులు స్థిరంగా తగ్గుముఖం




పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "ప్రస్తుతం శ్వాసకోశ నిఘా ప్రకారం, హెచ్ 1ఎన్ 1 (ఇన్ ఫ్లుయెంజా-ఏ) ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. మనుషులకు ఇన్ ఫ్లుయెంజా-ఏ, ఇన్ ఫ్లుయెంజా- బి అనే రెండు రకాలు వస్తాయి. ఇన్ ఫ్లుయెంజా-ఏలో మేము ఎక్కువగా చూస్తున్నది హెచ్ 1ఎన్ 1 వైరస్ . ఇది సుమారు 97-98 శాతంగా ఉంది. కాగా హెచ్ 3ఎన్ 2 రకం వైరస్ కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే ఉంది. దీనితోపాటు విక్టోరియా లీనియేజ్ కి చెందిన ఇన్ ఫ్లుయెంజా-బి కూడా వ్యాప్తిలో ఉంది. ఇందులో రెండు రకాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒక్కటి మాత్రమే వ్యాప్తిలో ఉంది. అది కూడా అంత ఎక్కువగా లేదు. హెచ్ 1ఎన్ 1 మాత్రమే ప్రధానంగా ఎక్కువగా వ్యాప్తిస్తోంది. మూడోది సార్స్ -కోవ్ -2 (కొవిడ్ -19) కేసులు అంతకు ముందు కొద్దిగా ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పుడు అవి తగ్గుముఖం పడుతున్నాయి" అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ చెప్పారు.

### ఈ వైరస్ లక్షణాలు ఇవే!

అయితే హెచ్ 1ఎన్ 1తో కూడిన ఈ సీజనల్ ఇన్ ఫ్లుయెంజా సాధారణంగా దానింతట అదే తగ్గిపోతుందని ఐసీఎంఆర్ ప్రకటించింది. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు దీని సాధారణ లక్షణాలు అని పేర్కొంది. సరైన వైద్యం, రక్షణ, విశ్రాంతి ఉంటే చాలా వరకు ఈ వ్యాధి నుంచి కోలుకోవచ్చని స్పష్టం చేసింది. కాగా, దేశ రాజధాని దిల్లీలో స్వైన్‌ఫ్లూ (ఎ1చీ1) కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సంఖ్య 2,300 దాటింది. ఈ ఏడాది దిల్లీలో ఇప్పటివరకు దాదాపు మూడు వేల ఇన్‌ఫ్లుయెంజా కేసులు నమోదయ్యాయని.. వాటిలో 2,308 హెచ్1ఎన్1 కేసులు ఉన్నాయని దిల్లీ వైద్యశాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ వెల్లడించారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

అనంతపురం, ఆగస్టు 25:-( అనంత సూర్య ): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని వివిధ శాఖల సంక్షేమ అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖల అధికారులు సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని వసతి గృహాలలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఆర్వో ప్లాంట్ లేని చోట గోరువెచ్చని నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతినెలా క్రమం తప్పకుండా ఆయా



వసతి గృహాల సమీపంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లతో వైద్య పరీక్షలు తప్పక చేయించాలన్నారు. ప్రతి వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం ఇవ్వాలన్నారు. విద్యార్థుల భోజన విషయంలో ఎటువంటి సమస్యలు వచ్చిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం నాణ్యతగా ఉండాలన్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితులలో విద్యార్థులకు ఇవ్వకూడదన్నారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం ప్యాకెట్లు ఎప్పటికప్పుడు ఎక్స్పైర్ డేట్ చెక్ చేసి తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులందరు ఎత్తుకు తగ్గ బరువు, మరియు పౌష్టికాహార లోపం లేకుండా ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేటట్లు అక్కడి సిబ్బంది చూడాలన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఉత్తీర్ణత శాతం తగ్గకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య 100% ఉండేటట్లు చూడాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి చేర్పించే విధంగా సంక్షేమ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ అధికారులకు కూలంకుషంగా వివరించి దిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం'లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం..

## – మంత్రి శ్రీమతి సవిత

పెనుకొండ, ఆగస్టు 25:( అనంత సూర్య) :బీసీల గురించి మాట్లాడే అర్హత మీకు లేదు మీ అయిదేళ్ల పాలనలో బీసీలను అణగదొక్కారుఇదేంటని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి జైల్లో బంధించారు.బీసీ బిడ్డను పెట్రోల్ పోసి తగులబెట్టారు. అక్రమ సంపాదనకు, అవినీతికి బీసీలను పావులుగా చేసుకున్నారు. చివరికి బీసీ బిడ్డలు చదువుకోవడం ఇష్టం లేక అయిదేళ్లలో బీసీ హాస్టళ్లను, గురుకులాలను గాలి కొదిలేశారు. ఆనాడు బీసీల సంక్షేమం ఎందుకు గుర్తుకు రాలేదాఅని జగన్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ప్రశ్నించారు. బీసీలను రాజకీయంగా జగన్ దెబ్బతీస్తే వెనుబడిన వర్గాలను సీఎం చంద్రబాబునాయుడు అక్కున చేర్చుకున్నారన్నారు. బీసీలకు ఒకవైపు సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, రాజకీయంగా వారి ఉన్నతికి పదవులు కేటాయిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, ఇందుకోసం న్యాయ పోరాటం చేస్తామని మంత్రి సవిత స్పష్టంచేశారు. రొద్దం మండలం కొగిర గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, పెనుకొండ నియోజక వర్గంలో 85 శాతం మేర ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని,



తమ నాయకులకు, కార్యకర్తలకు ఘన స్వాగతం పలుకుతున్నారని ఆమె ఆనందం వ్యక్తంచేశారు. నా బీసీలంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బడుగు, బలహీన వర్గాల వారిని తన అయిదేళ్ల పాలనలో అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి, బీసీలను రాజకీయంగా దెబ్బతీశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసితీరుతా మన్నారు. అంతకుముందు కొగిరి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త ఆంజనేయుల కుటుంబానికి మంత్రి సవిత పరామర్శించారు. రూ.5 లక్షల జీవిత బీమా చెక్ ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రాణాలు గాలికొదిలేసిన అధికారులు

- విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలం
- బీసీ హాస్టల్లో పాము కాటు గురైన సుమన్ అనే విద్యార్థి పూర్తి బాధ్యత ప్రభుత్వందే
- సంక్షేమ హాస్టల్లో స్థానికంగా నివాసం ఉండాలి
- ఎస్ఎఫ్ఐ నేతలు

అనంతపురం, ఆగస్టు 25 అనంత సూర్య : విద్యార్థుల ప్రాణాలను అధికారులు గాలికి వదిలేశారని, కనీసం మౌలిక వసతులు కల్పించడంలోనూ విఫలం చెందారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ విమర్శించారు. మంగళవారం గుంతకల్లు బీసీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థి సుమన్ పాముకాటుకు గురి కావడంతో సన్ లైఫ్ హాస్పిటల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ ఎసఎఫఐ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ అనంతపురం నగర అధ్యక్షుడు భీమేష్ పరామర్శించారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరపాలని ఎసఎఫఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ సమస్యలను ప్రభుత్వం ప్రభుత్వాధికారులు గాలికి వదిలేసిందన్నారు. దీనికి ప్రత్యేక నిదర్శనం గత రెండు రోజులు క్రితం శెట్టూరు ఎస్సీ హాస్టల్లో హర్షవర్ధన్ అనే విద్యార్థి గోడ కూలి మరణించడం జరిగిందన్నారు. మరొక విద్యార్థికి తీవ్రంగా గాయాలపాలు కావడం జరిగిందన్నారు. ఈ ఘటన జరిగి 24 గంటలు సమయం



ముగియకముందే జిల్లాలో మరొక ఘటన గుంతకల్లు బీసీ సంక్షేమ హాస్టల్లో డిగ్రీ చదువుతున్న సుమన్ అనే విద్యార్థి బీసీ హాస్టల్లో పాము కాటు గురి కావడం బాధాకరమన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక సంక్షేమ హాస్టల్స్లో కనీసం మౌలిక వసతులు కరువయ్యాయని, జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. చాలా సంక్షేమ హాస్టల్స్లో అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్స్కు కనీసం కాంపౌండ్ వాల్ రక్షణ కోసం కూడా కరువైపోయిందన్నారు. ఉన్న సంక్షేమ హాస్టల్స్లో జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్లో కనీసం తాగడానికి మంచినీరు కూడా లేవన్నారు. చాలా సంక్షేమ హాస్టల్స్లో ప్రభుత్వం అందజేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. టాయిలెట్ సదుపాయాలు వాటికి సంబంధించిన డోర్లు లేవని, ప్రతి రెండు నెలలకు ఒకసారి సంక్షేమ హాస్టల్స్లో వైద్య పరీక్షలు నిర్వహించాలి కానీ.. ఈ నిబంధన ఏ సంక్షేమ హాస్టల్లో పాటించడం లేదన్నారు. సంక్షేమ హాస్టల్లో ఉన్న విద్యార్థులు అనేక సీజన్ వ్యాధులతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొన్ని సంక్షేమ హాస్టల్స్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించకుండా విద్యార్థులు కడుపులు కొడుతున్నారని, తక్షణమే జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి హాస్టల్లో ఉన్న సమస్యలపై పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, భీమేష్, చిన్న, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ 51 మంది

# పారా లీగల్ వాలంటీర్ల పరిచయ కార్యక్రమం

అనంత లీగల్, ఆగస్టు 25:( అనంత సూర్య) పారా లీగల్ వాలంటీర్ల ద్వారా విస్తృతంగా న్యాయ సేవలు. ఎన్ రాజశేఖర్ కార్యదర్శి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అనంతపురం. అనంతపురం జిల్లా కోర్టు ఆవరణలో గల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సేవ సదన్ నందు 51 మంది ని పారా లీగల్ వాలంటీర్స్ గా



గుర్తించి వారితో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, అనంతపురము ద్వారా విస్తృతంగా మారుమూల ప్రాంతాల్లో, అభివృద్ధికి దూరంగా ఉన్న వ్యక్తులకు కూడా న్యాయ సేవలను అందుబాటులోకి తీసుకురావచ్చు అని ఆ సదుద్దేశంతోనే పారా లీగల్ వాలంటీర్ వ్యవస్థను న్యాయ సేవా అధికార సంస్థ మొదలుపెట్టిందని కార్యదర్శి తెలిపారు. వీటి ద్వారా ప్రజలలో న్యాయపరమైన అంశాలను అవగాహన కలిగించొచ్చని తమ పరిసర ప్రాంతాలలో ఏదైనా అన్యాయం జరిగినప్పుడు చట్ట వ్యతిరేకమైన కార్యక్రమం చేపట్టినప్పుడు వాటిని న్యాయ సేవ అధికార సంస్థలకు తెలియజేసి వాటి ద్వారా సమాజంలో న్యాయాన్ని పదిల పరచవచ్చు అని తెలియజేశారు. మొదటగా ఈ కార్యక్రమంలో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసిన తర్వాత పారా లీగల్ వాలంటీర్స్ యొక్క విధులను బాధ్యతలను తెలియజేశారు. అలాగే రాజ్యాంగ మౌలిక సూత్రాలను ప్రాదేశిక విధులను ప్రాథమిక విధులను హక్కుల గురించి సీనియర్ న్యాయవాది నల్లప్ప తెలియజేశారు. అలాగే పర్మనెంట్ లోక్ అదాల త్ ఛైర్పర్సన్ శైలజ దేవి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్, న్యాయ సేవ అధికార సంస్థ యొక్క సేవలను విస్తృతంగా సమాజంలో తెలియజేసి వాటిని ప్రజలు సద్వినియోగ పరుచుకునేలా అవగాహన కల్పించాలని తెలియజేశారు.

## మరొక మండల్ ఉద్యమం కు బీసీ లు సిద్ధం కావాలి

అనంతపురం, ఆగస్టు 25: (అనంత సూర్య ) : మండల్ జయంతి సందర్భంగా దీజ లు మరొక సారి ఉద్యమం కోసం సిద్ధం కావాలని, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, వ్యవస్థాపకులు పోతుల నాగరాజు దీజ లకు పిలుపు నిస్తూ, దేశంలో ఇంత అన్యాయం ఏ వర్గం కు జరగలేదు కేవలం దీజ లకే ఇంత వివక్ష కొనసాగుతున్నది సమాధానం చెప్పండి అని అన్ని రాజకీయ పార్టీ లను ప్రశ్నిస్తున్నాము? రిజర్వేషన్ విధానం ాజ లకు, ాా లకు, చివరికి జుఔా రిజర్వేషన్ కూడా వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ అమలు జరుగుతున్నది. మరి దేశ జనాభా లో 56%ఉన్న దీజ లకు ఒక్కోక్క చోట ఒక విదంగా ఎందుకు రిజర్వేషన్ ఉంది .కేంద్రం లో 27% రాష్ట్ర ములో 25% స్థానిక సంస్థ లలో 34%ఒక రాష్ట్రము లోను మరొక రాష్ట్రము 42%అని ప్రకటించిన పాలకులు ఎందుకు ఒకే రిజర్వేషన్ విధానం దీజ లకు లేదో సమాధానం చెప్పండి అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, న్యాయ వ్యవస్థలకు డాక్టర్ పోతుల నాగరాజు సూటిగా అడుగుతా ఉన్నారు.

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాలి

## – జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి,ఆగస్టు,25:( అనంత సూర్య) : తెలుగు భాషా వికాసానికి, పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన



తెలుగు భాషా దినోత్సవ వేడుకల ప్రచార పోస్టర్ను మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మాతృభాష అయిన తెలుగును కాపాడుకోవడం మరియు దాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా విశిష్టతను చాటేలా వివిధ పోటీలు, కార్యక్రమాలు నిర్వహించాలి.గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య,డిఇఓ క్రిస్టప్ప ,జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

చిలమత్తూరు, ఆగస్టు 25:( అనంత సూర్య) శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట చాగలేరు పంచాయతీకి చెందిన పలువురు రైతులు ఆందోళనకు దిగారు. తమ సొంత వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ, గత రెండు వారాలుగా రిజిస్ట్రేషన్ చేయకుండా



తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ, స్పష్టమైన కారణం తెలియజేయకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు లొంగి సామాన్య రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వారు ఆరోపిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళన కారణంగా రిజిస్ట్రేషన్ సేవలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. అయితే ఆందోళన విషయం ముందుగానే తెలుసుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బయటకు వెళ్లినట్లు రైతులు పేర్కొన్నారు. “పత్రాలు సక్రమంగా ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్ ఎందుకు చేయడం లేదు? కారణం ఏమిటో స్పష్టంగా చెప్పాలి. సామాన్య రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం ఆపాలి” అంటూ రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



# అనంతలో.. మాయ కేంద్రం!

**అనంతపురం, ఆగస్టు 25 అనంత సూర్య :**

తాము దూర సందు లేదు.. మెడకో డోలా.. అన్నట్లుగా కరువు జిల్లా అనంతలో ఆదుకునే దిక్కు లేక యువత కన్నీరు పెడుతుంది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం యువతను దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేయడానికి దేశవ్యాప్తంగా 623 నెహ్రూ యువ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో ఒకటి అనంతలో కూడా. ఈ సంస్థ స్వయం ప్రతిపత్త సంస్థగా భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోనికి వస్తుంది. అంతటి ప్రధానమైన శాఖలో అవినీతి తాండవం చేస్తుందంటే ఎవరైనా నమ్ముతారా ! దర్యాప్తు సంస్థలు తమదైన రీతిలో టచ్ చేస్తే.. నమ్మక తప్పదు అంటున్నారు స్వయాన అనంతపురం జిల్లా యువత. ఆ వివరాలను ఒక్కసారి అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా పరిశీలిస్తే..

> అటకెక్కిన యువత అవసరాలు, అభివృద్ధి, రికార్డుల నిర్వహణ
>
> నీరుగారుతున్న భారత ప్రభుత్వ లక్ష్యం
>
> నిధుల దోపిడీతో రూ.కోట్లకు పలువురు పడగలు
>
> టచ్ చేస్తే.. తెప్పలు తెప్పలుగా దరఖాస్తుల దొంగ లెక్కలు
>
> పలువురు ఆర్టీఐ అర్జీదారులకు క్రీడా సామాగ్రితో బురిడీ ?
>
> దేశ నేతలు దృష్టి పెడితే.. యువత తప్పదు క్రమశిక్షణ

అనంతపురం జిల్లా నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యువత అభివృద్ధి, అవసరాల గుర్తింపు, రికార్డుల నిర్వహణ అన్నీ అటకెక్కాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారత ప్రభుత్వ ప్రధాన లక్ష్యమైన యువతలో క్రమశిక్షణ, వాలంటరిజం, స్వయం సహాయక భావన నీరుగారిపోతోందని పలు యూత్ క్లబ్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం. లేని యూత్ క్లబ్‌లు ఉన్నట్లు, జరగని కార్యక్రమాలు జరిగినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

## నిధుల దోపిడీతో రూ.కోట్లకు పలువురు పడగలా ?

యువతను అన్ని విధాలుగా అభివృద్ధి వైపుకు ప్రోత్సహించేందుకు కేంద్రం నుంచి వచ్చే కోర్ ప్రోగ్రామ్ నిధులు, క్రీడా సామాగ్రి, స్కిల్ డెవలప్మెంట్ నిధుల వినియోగంలో రూ.కోట్లలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. నిధుల దోపిడీతో కొందరు ఆస్తులు కూడబెట్టారనే చర్చ యువజన వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ దొంగ లెక్కల వ్యవహారంపై టచ్ చేస్తే చాలట. దరఖాస్తుల్లో దొంగ లెక్కలు తెప్పలు తెప్పలుగా బయటపడుతున్నాయని

## ఆర్టీఐ అర్జీదారులకు క్రీడా సామాగ్రి బహుమానాలతో బురిడీ ?

కార్యాలయంలోని అసలు సమాచారం బయటకు రాకుండా సమాచారం కోసం దరఖాస్తు చేసిన పలువురు ఆర్టీఐ అర్జీదారులను సైతం క్రీడా సామాగ్రి బహుమానాలతో బురిడీ కొట్టిస్తున్నారని తెలిసింది. ఈ విషయంపై విశ్వసనీయ వర్గాలు ఏమంటున్నాయంటే.. ఓ పదేళ్లకు సంబంధించిన ఆర్టీఐ అర్జీలను పరిశీలిస్తే చాలట. అడిగిన ప్రశ్నలకు ఆర్టీఐ ద్వారా ఇచ్చిన సమాధానానికి పొంతనలేదని తెలుస్తుంది. ఏదో ఒక సమాచారం ఇచ్చి పలువురు ఆర్టీఐ అర్జీదారులను మరోరకంగా సంతృప్తి పరిచారని తెలుస్తుంది. దేశ నేతలు, ఉన్నతాధికారులు దృష్టి పెడితే తప్ప యువతకు ఉపాధితో క్రమశిక్షణ అభివృద్ధి దక్కని పరిస్థితి అనంతలో నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అసలు నెహ్రూ యువ కేంద్రాన్ని అనంతలో **'మాయ కేంద్రం'**గా ఎందుకు పలువురు అభివర్ణిస్తున్నారు. కేంద్రం నుండి ప్రతి ఏటా విడుదలవుతున్న నిధులు ఎంత ? నేషనల్ యూత్ కార్ప్స్ వాలంటీర్లకు చెల్లిస్తున్నామని చెబుతున్న గౌరవ వేతనంలోని నొక్కుళ్లు ఎంత? జిల్లా కార్యాలయంలో కీలకంగా మారి కాసు వ్యవహారాలన్నీ చక్కబెడుతున్న ఆ మహానుభావుడు ఎవరు అన్నది కూడా మరో కథనంలో **'అనంత సూర్య'** వివరించే ప్రయత్నం చేస్తుంది.

## కొత్తవారికి మోకాలొడ్డి పాతుకుపోయిన ఆ ఎన్జీవోలు..

**ఆరేడేళ్లుగా ఆ కేంద్రంలో ఓ మూడు ఎన్జీవో సంస్థలు పాతుకు పోయి.. కొత్త వారికి అవకాశం లేకుండా అన్ని కార్యక్రమాలు వారి ద్వారానే జరిగేలా, పక్కా ప్రణాళికలతో ఆ కేంద్రం వారిదే నన్నట్లుగా.. రెన్యువల్స్ చేసుకుంటూ పాతుకుపోయారని తెలిసింది. వారెవరన్నది ? వారు అక్కడ చేస్తున్న వక్రపనులు ఏంటి ? అన్నది మరో కథనంలో 'అనంత సూర్య' తెలియజేస్తుంది.**

## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా

# రేపటి రామాంజినేయులు ఏకగ్రీవం

> ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ జిల్లా కమిటీల ఎంపిక
>
> జిల్లా కార్యవర్గ సభ్యులుగా కుంచపు భాస్కర్, ఎనుముల కుళ్లాయప్ప
>
> రేపటి రామాంజనేయులు ఎన్నికపై జర్నలిస్టుల హర్షం
>
> జర్నలిస్టుల సమస్యలపై అవిశ్రాంత పోరాటం
>
> రామాంజనేయులు వెల్లడి





**అనంతపురం, ఆగస్టు 25 అనంత సూర్య :**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఐ న్యూస్ బ్యూరో సీనియర్ జర్నలిస్టు రేపటి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెడికల్ కళాశాల పక్కన ఉన్న ఐఎంఏ హాల్లో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎన్నికలు సందడి వాతావరణంలో జరిగాయి. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాయలసీమ ఇన్‌ఛార్జి జయరాజ్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ముందుగా వందలాదిగా తరలివచ్చిన జర్నలిస్టులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహానికి కూడా పూలమాలలు వేశారు. అక్కడి నుంచి ఐఎంఏ హాల్‌కు చేరుకున్న జర్నలిస్టులు ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టు తలారి రామాంజనేయులు, సహాయ ఎన్నికల అధికారిగా ప్రతిమ వ్యవహరించారు. ముందుగా ఏపీడబ్ల్యూజేఎఫ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) నూతన జిల్లా కమిటీల ఎంపికకు నామినేషన్ల ప్రక్రియ జరిగింది. జర్నలిస్టులంతా ఏకతాటి పైకి వచ్చి రెండు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రేపటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శివ ప్రకాష్, ఏపీ బీజేఏ జిల్లా అధ్యక్షుడిగా బి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్.కే సూర్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ.. ఇక నుంచి జర్నలిస్టుల సమస్యలపై తమ పోరాటాలు ఉధృతంగా సాగుతాయని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 12 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ విధానం కొనసాగుతోందని.. అదే తరహాలో ఏపీలో కూడా అమలు చేయాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. మా సమస్యలపై ప్రజా ప్రతినిధులకు చెబితే సానుభూతి చూపిస్తున్నారని.. మాకు సానుభూతి వద్దని సమస్యల పరిష్కారం కావాలన్నారు. నిజాయితీగా వార్తలు రాసేవారికి రక్షణ లేకుండా పోతోందని, అందుకే జర్నలిస్టుల భద్రతకు కమిషన్ వేయాలన్నారు. నూతన కమిటీతో కలసి జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

### ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా శాఖ ఎన్నికలు

గౌరవాధ్యక్షులుగా తలారి రామాంజనేయులు, అధ్యక్షులుగా రేపటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శివప్రకాష్, కోశాధికారిగా సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటేశులు, కన్న, హరిప్రసాద్, సహాయ కార్యదర్శులుగా కే.రవీంద్రనాథ్, సతీష్‌బాబు, గోవింద్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా కె.అమర్ బ్రహ్మాచారి, కార్యవర్గ సభ్యులుగా షేర్‌ఖాన్, కుంచపు భాస్కర్, డి.తిమ్మప్ప, వై.కుల్లాయప్ప, కేసీ తిమ్మప్ప, రామాంజ రెడ్డి, అస్లాం బాషా, శరత్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





## దివ్యాంగ యువతకు

# ఉచిత పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ



**అనంతపురం, ఆగస్టు 25 అనంత సూర్య :**

దివ్యాంగ యువత తమ కలలను సాకారం చేసుకునే దిశగా వారికి చేయూతనందించాలనే ఉద్దేశంతో సంగీత మొబైల్స్, ఏజీఎస్ ఫౌండేషన్ సహకారంతో అనంతపురం పట్టణానికి చెందిన అర్హులైన దివ్యాంగ యువతకు ఉచితంగా పోటీ పరీక్షల తయారీకి అవసరమైన పుస్తకాలను పంపిణీ చేసింది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సంగీత మొబైల్స్ షోరూమ్ సిబ్బంది, డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఏజి.అనిల్ కుమార్ చేతుల మీదుగా ఈ పుస్తకాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి ముందుకు వచ్చిన సంగీత మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగ యువత తమ లక్ష్యాలను చేరుకోవడానికి, పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి అవసరమైన నాణ్యమైన అధ్యయన సామగ్రి అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. 'పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు చాలా ఖరీదైనవిగా ఉండటంతో నిరుపేద, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు వాటిని కొనుగోలు చేయడం కష్టంగా మారుతోంది. ముఖ్యంగా దివ్యాంగ యువతకు ఈ పుస్తకాలు అందించడం ద్వారా వారు మెరుగైన సన్నద్ధతతో పోటీ పరీక్షలకు సిద్ధమై, తమ కలలను సాకారం చేసుకునేందుకు ఒక గొప్ప అవకాశం లభిస్తుంది' అని అనిల్ కుమార్ పేర్కొన్నారు. విద్య, ఉపాధి అవకాశాల ద్వారా దివ్యాంగ యువతను సాధికారత దిశగా నడిపించే ఇటువంటి గొప్ప సామాజిక కార్యక్రమంలో భాగస్వామ్యం అయిన సంగీత మొబైల్స్‌ను ఆయన అభినందించారు. సమాజంలో మరిన్ని సంస్థలు, వ్యక్తులు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు వచ్చి అర్హులైన విద్యార్థులకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పుస్తకాలు అందుకున్న లబ్ధిదారులు సంగీత మొబైల్స్, ఏజీఎస్ ఫౌండేషన్ మరియు డిస్కవర్ అనంతపురం పట్ల తమ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ పుస్తకాలు పోటీ పరీక్షల సన్నద్ధతలో ఎంతో ఉపయోగపడతాయని, తమ ఆశయాలను నెరవేర్చుకునే ప్రయాణంలో గొప్ప తోడ్పాటుగా నిలుస్తాయని వారు తెలిపారు. సంగీత మొబైల్స్, ఏజీఎస్ ఫౌండేషన్, డిస్కవర్ అనంతపురం సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం, దివ్యాంగ యువతకు అవకాశాలను కల్పిస్తూ వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి తమ కలలను సాకారం చేసుకునే దిశగా ఒక స్ఫూర్తిదాయకమైన అడుగుగా నిలిచింది.

## మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం, ఆగస్టు 25 అనంత సూర్య :**

జిల్లా పర్యటనలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. జిందాల్ విజయనగర విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బళ్లారి మండలం కుడితిని ప్రాంతానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కి స్థానిక తెలుగు ప్రజానీకం, యువత, తెలుగుదేశం పార్టీ అభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ బలోపేతం, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. మంత్రి నారా లోకేష్ పర్యటనతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని నాయకులు పేర్కొన్నారు.

# రాప్తాడుకు మరో విద్యుత్ సబ్ స్టేషన్

- హర్షం వ్యక్తం చేసిన బండమీదపల్లి గ్రామస్తులు
- ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు
- ఇప్పటికే 5 సబ్ స్టేషన్లు నియోజకవర్గానికి వచ్చాయన్న ఎమ్మెల్యే సునీత



**అనంతపురం, ఆగస్టు 25 అనంత సూర్య :**

రాప్తాడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి 5విద్యుత్ సబ్ స్టేషన్లను తీసుకురాగా... తాజాగా రాప్తాడు మండలం బండమీద పల్లి గ్రామానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో బండమీదపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే పరిటాల సునీతను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం చేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని.. సబ్ స్టేషన్ రావడం వలన చాలా వరకు ఆ సమస్యలు తీరుతాయని వారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయంలో విద్యుత్ కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే గ్రామాల్లో కూడా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నూతన సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు పెద్ద ఎత్తున నియోజకవర్గానికి తీసుకొస్తున్నట్లు ఆమె చెప్పారు. త్వరలోనే 3కోట్ల రూపాయలతో ఈ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# అటవీశాఖ సోషల్ ఫారెస్ట్ డివిజన్ వారిచే సీడ్ బాల్స్ థిస్ పర్సల్



**తాడిపత్రి, అగస్టు 25 అనంత సూర్య :**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా సోషల్ ఫారెస్ట్ డివిజన్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎం.గురు ప్రభాకర్ ఆధ్వర్యంలో జిల్లా అంతటా 8 లక్షల సీడ్ బాల్స్ తయారు చేశారు. వాటిని వివిధ ప్రాంతాలలో థిస్ పర్సల్ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తాడిపత్రి మండలం ఓబులేసుని కోన గుట్టపైన 50 వేల విత్తన బంతులను బ్రాడ్ కాస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఫారెన్స్ దీపా, అటవీ శాఖ సిబ్బంది, ఓబులేసిన కోన ఆలయ అర్చకులు బుక్కపట్నం యోగానంద శర్మ, రమణ మహర్షి అనాధ పిల్లల గురుకుల పాఠశాల ఆవుల తిప్పేపల్లి గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405